# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 28-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- అణగారిన వర్గాల వారి న్యాయం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- జమ్మూ- కాశ్మీర్ ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని బీజేపీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- భారత్ 144 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తితో ప్రపంచంలో 2వ అతిపెద్ద దేశంగా ఉందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.
- గత 10 సంవత్సరాల్లో దేశ, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించిందని కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ తెలియజేశారు.
- రానున్న పండుగల నేపథ్యంలో అక్టోబరు 1 నుంచి నవంబరు 30 వరకు 6 వేల ప్రత్యేక రైళ్లను నడపనున్నామని రైల్వే అధికారులు వెల్లడించారు.

========================

అణగారిన వర్గాల వారి సామాజిక న్యాయం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ రోజు హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవంలో ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగించారు. బాలికలు మెరుగైన ప్రతిభ కనబరిచినందుకు అభినందిస్తూ.. మహిళా సాధికారత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిజం మాట్లాడటం న్యాయవాద సోదరభావాన్ని మరింత శక్తివంతం చేస్తుందన్నారు. విద్యార్థులు జాతీయ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని రాష్ట్రపతి పేర్కొంటూ…

(వాయిస్ 38 సెకన్లు)

========================

జమ్మూ- కాశ్మీర్ ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని, తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాక్షిస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జమ్మూలో ఈ రోజు జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం "ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్"ను అమలు చేసిందని తెలిపారు. 2016లో ఇదే రోజున పాకిస్థాన్‌పై భారత్ సర్జికల్ స్ట్రైక్ చేసిందని నరేంద్రమోదీ గుర్తు చేశారు. ఇదిలా ఉండగా జమ్మూకశ్మీర్‌లోని 40 అసెంబ్లీ స్థానాలకు అక్టోబరు 1న పోలింగ్ జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ దేశం 144 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తితో ప్రపంచంలో 2వ అతిపెద్ద దేశంగా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన గ్రీన్ స్టీల్ ఉత్పత్తిపై 3 రోజుల అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న మంత్రి ప్రసంగిస్తూ.... ఉక్కు రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు మెటీరియల్ సామర్థ్యాన్ని ప్రశంసిస్తూ.. ఇది ప్రపంచ ఉక్కు ఉత్పత్తిని 2 బిలియన్ మెట్రిక్ టన్నులకు చేరువ చేసిందన్నారు. ఉద్గారాల స్థాయిలను, పర్యావరణ కార్బన్ పాదముద్రను తగ్గించేందకు ఉక్కు రంగం భవిష్యత్తు డిజిటలైజేషన్, స్థిరమైన ఉక్కు ఉత్పత్తిపై ఉంటుందని తెలిపారు. ప్రాసెస్ ఇన్నోవేషన్, ప్రాదమిక, ద్వితీయ లోహాలను ఉత్పత్తి చేసే వారి మధ్య బలమైన సహకారం ద్వారా తక్కువ కార్బన్ మెటల్ ఉత్పత్తికి మారాలని భూపతిరాజు శ్రీనివాస వర్మ పరిశ్రమను కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఎక్స్‌ప్రెస్ హైవేలు, ఇండస్ట్రియల్ కారిడార్లు, ఓడరేవుల అభివృద్ధి, పెంపుదలతో రాబోయే 25 సంవత్సరాల్లో స్పష్టమైన అభివృద్ధి మార్గాన్ని చూపించామని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ ఉద్ఘాటించారు. ఈరోజు చెన్నైలో "ఏక్ పేడ్ మా కే నామ్" ప్రచారంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం శ్రద్ధ వహించిందని పేర్కొన్నారు. తమిళనాడును అభివృద్ధి చేయడంలో కేంద్ర ప్రభుత్వం సానుకూల పాత్ర పోషించిందని, "మేక్ ఇన్ ఇండియా" పథకం కింద రక్షణ సామాగ్రిని తయారు చేయడం, ఇతర దేశాలకు ఎగుమతి చేయడం వంటి ప్రోత్సాహక కార్యక్రమాలను నిర్వహించిందని మంత్రి తెలిపారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2వ తేదీన ఖాదీ దుస్తులు ధరించాలని మంత్రి మురుగన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే పండుగలైన దుర్గాపూజ, దీపావళి, ఛత్ పూజల సందర్భంగా భారతీయ రైల్వేలు అక్టోబరు 1 నుంచి నవంబరు 30 తేదీల మధ్య 6 వేల ప్రత్యేక రైళ్లను నడపనుంది. లక్షలాది మంది ప్రయాణికుల ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు భారతీయ రైల్వే ప్రతి సంవత్సరం పండుగ సీజన్‌లో ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. గత సంవత్సరాలతో పోలిస్తే ప్రత్యేక రైళ్లలో గణనీయమైన పెరుగుదల ఉంది. గతేడాది ఈ సీజన్‌లో 4,429 ప్రత్యేక రైళ్లను నడిపారు. ప్రత్యేక రైళ్లతో పాటు 108 రైళ్లకు అదనపు జనరల్ కోచ్‌లను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది. ఈ పండుగల సమయంలో సాధారణంగా కనిపించే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మొత్తం 12 వేల 500 కోచ్‌లు మంజూరు అయ్యాయి. దీంతో కోటి మందికి పైగా ప్రయాణికులు పండుగల రద్దీలో ఇళ్లకు వెళ్లేందుకు వీలు కలుగుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు

అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ఆయనకు నివాళులర్పించారు. మాతృభూమి, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు భగత్ సింగ్‌కు నివాళులు అర్పిస్తున్నానని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమాల వేదికగా తెలియజేసింది.. విప్లవకారుడు భగత్‌సింగ్ బ్రిటీష్ వారి పాలనను సవాల్ చేయడమే కాకుండా దేశ స్వాతంత్ర్యం, బంగారు భవిష్యత్తు కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని హోంమంత్రి అమిత్ షా అన్నారు. భగత్ సింగ్ త్యాగం యొక్క మెరుపు ఎంతో గొప్ప జ్వాలగా మారిందని, దేశ వ్యాప్తంగా స్వాతంత్ర్య ఉద్యమం మరింత ఉధృతంగా మారిందని అమిత్ షా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గాజాలోని పాలస్తీనా జనాభాకు ప్రాథమిక ఆహార సరఫరా ఆలస్యం లేకుండా చేరేలా అన్ని విదాలా అవసరమైన చర్యలు తీసుకోవాలని హేగ్ లోని అంతర్జాతీయ న్యాయస్థానం ఇజ్రాయెల్‌ను ఏకగ్రీవంగా ఆదేశించింది. గాజాలోని పాలస్తీనియన్లు అధ్వాన్నమైన జీవన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, కరువు, ఆకలి చావులు విస్తరిస్తున్నాయని ప్రపంచ న్యాయస్థానం పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళం నిర్వహించిన జాతీయ స్థాయి క్విజ్ పోటీ THINQ24 కోసం పాఠశాల జట్ల తుది జాబితా ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. తుది జాబితాలో పాఠశాలలు అక్టోబర్ 14, 15వ తేదీలలో ఆన్‌లైన్ లో నిర్వహించే జోనల్ రౌండ్‌లలో పాల్గొంటాయని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సంవత్సరం, థింక్-2024 ప్రత్యేక ఉద్దేశ్యం వికసిత్ భారత్-2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే దృక్పథంతో ఈ ఇతివృత్తాన్ని రూపొందించారు. ఈ క్విజ్ పోటీ కేవలం విద్యార్థుల సాధారణ అవగాహనను పరీక్షించేందుకు నిర్వహిస్తున్నారు. దేశ నిర్మాణంలో వారి పాత్రపై విద్యార్థులలో అవగాహన కల్పించడానికి, వారి హృదయాలలో ప్రేరణ కలిగించడానికి, మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఈ క్విజ్ పోటీలు ఒక వేదికగా ఉపయోగపడతాయి. THINQ-24 క్విజ్ పోటీల సెమీఫైనల్స్, ఫైనల్స్ నవంబరు 7, 8వ తేదీలలో దక్షిణ నావికాదళ కమాండ్ ఆధ్వర్యంలో కేరళలోని ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీ అయిన ప్రధాన నౌకాదళ శిక్షణా సంస్థలో నిర్వహిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గాయని లతా మంగేష్కర్ తన మనోహరమైన పాటలతో ప్రజల హృదయాలలో ఎప్పటికీ నిలిచి ఉంటారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈరోజు లతా మంగేష్కర్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి ఆమెను స్మరించుకున్నారు. ఈ మేరకు సామాజిక వేదికగా ఆమెతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. లతా మంగేష్కర్‌తో తనకు ప్రత్యేక బంధం ఉందని, ఆమె ఆప్యాయత, ఆశీస్సులు పొందడం తన అదృష్టంగా భావిస్తున్నానని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ లెబనాన్ దేశ రాజధాని బేరూట్‌పై జరిపిన దాడుల్లో హిజ్‌బుల్లా అగ్రనేత హసన్ నస్రల్లా మృతి చెందారు. లెబనీస్ సాయుధ దళం ఆయన మృతిని ధృవీకరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ జమ్మూ కాశ్మీర్‌పై చేసిన ప్రస్తావనపై భారత దౌత్యవేత్త భావికా మంగళానందన్ స్పందిస్తూ... ఉగ్రవాదం, మాదకద్రవ్యాల వ్యాపారం, అంతర్జాతీయ నేరాలకు ప్రపంచ ఖ్యాతి గడించిన మిలటరీ ఆధ్వర్యంలో నడుస్తున్న దేశం ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యంపై దాడి చేస్తోందన్నారు. అలాగే చాలా కాలంగా సరిహద్దు ఉగ్రవాదాన్ని పొరుగు దేశాలపై ఆయుధంగా పాకిస్తాన్ ఉపయోగిస్తుందన్నారు.

==========================

ఇండియన్ ఆర్మీ ఈరోజు 198వ గన్నర్స్ డేని జరుపుకుంటుంది. 1,827 సంవత్సరం ఈ రోజున 5 (బాంబే) మౌంటైన్ బ్యాటరీ అనే మొదటి భారతీయ ఆర్టిలరీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన జ్ఞాపకార్థం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆర్టిలరీ లెఫ్టినెంట్ జనరల్ అదోష్ కుమార్ ఆకాశవాణితో మాట్లాడుతూ... ఆత్మ నిర్భర భారత్ లక్ష్యంగా సాంకేతికంగా అభివృద్ధి చెందిన పోరాటం ఆధారంగా భారతీయ ఆర్టిలరీ యూనిట్ - ఫిరంగిదళం- ఆధునికీకరణ ప్రక్రియ బాటలో ఉందని పేర్కొన్నారు.

==========================

==========================